క్లుప్తంగా

ముగిసిన గంజిహాళ్లి ఉరుసు



స్వామివారికి జియారత్ గంధం సమర్పిస్తున్న పీఠాధిపతులు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన సద్గురు మహాత్మ బడేసా హెబ్ తాత ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం జియారత్ కార్యక్రమంతో ఉరుసు ముగిసింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫాతెహాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దర్గా పీఠాధిపతులు సయ్యద్ చిన్న ముద్గోల్, మన్సూర్, ఉసేన్, బడేసా, చాంద్‌బాషలు స్వామి వారి గంధంతో ఊరేగింపుగా దర్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్వామి వారి జీవసమాధికి భక్తితో గంధం పట్టించారు. సమాధిని పూలతో అలంకరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మారుతి

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో రోగుల ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతాయని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి అన్నారు. ఆయన సోమవారం మొలగవల్లిలోని సచివాలయం-1 పరిధిలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందించారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు వైద్య, రక్తహీనత పరీక్షలు చేశారు. బలహీనంగా ఉన్న చిన్నారులకు ఎలాంటి ఆహారం ఇవ్వాలో తల్లిదండ్రులకు సూచించారు. అవసరమైన వారికి ఐరన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు.


కరాటే పోటీల్లో ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు

ఎమ్మిగనూరుటౌన్: నంద్యాలలో ఈనెల 26వ తేదీన జరిగిన 2వ జిల్లా స్థాయి జీత్-కునే-డో (కరాటె) పోటీల్లో పట్టణంలోని ఎంఎస్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 14 సంవత్సరాల్లోపు బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన కె.రమ్యశ్రీ, కె.నిత్యసాయి వెండి పతకాలతో పాటు ప్రశంసాపత్రాలను సాధించారు. అదేవిధంగా యు.మౌనిక, యు.గౌరి, మౌనిక,హారిక కాంస్య పతకాలు కైవసం చేసుకున్నట్లుహెచ్‌ఎం గౌసియాబేగం సోమవారం తెలిపారు. 12 సంవత్సరాల్లోపు విభాగంలో డి.అంజుమ్, కె.రాగదీపిక, లేఖశ్రీ, సుమిత్ర, సుకన్య, కె.నాఫియాబేగం, దక్షిత, బుజ్జమ్మ కాంస్య పతకాలు పొందినట్లు ఆమె పేర్కొన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారిణులు, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయినులు కె.సుజనకుమారి, టి.నాగేశ్వరిలను అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు సౌజన్యలత

నందవరం: వేసవి కాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యురాలు సౌజన్యలత సూచించారు. సోమవారం జొహరాపురం ఎంపీయూపీ పాఠశాలలో శిబిరం నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు చికిత్స చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిలో వాతావరణ మార్పులతో పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరాలు, తట్టు వంటివి సోకే అవకాశం ఉందన్నారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గర్భిణులు, బాలింతులు పౌష్టికాహారం తీసుకోవాలని తద్వారా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌ఎన్ లక్ష్మిదేవి, హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్, హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి, ఏఎన్‌ఎం పుష్పావతి పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆలూరు రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆలూరు ఎంపీడీఓ అల్లబకాష్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సమావేశానికి ఎంపీపీ మంగమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్ హాజరవుతున్నారన్నారు. ఎంపీటీసీలు, గ్రామ సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

బుడుగు బలానికి రాగి జావ

- ప్రభుత్వ పాఠశాలల్లో అమలుకు సీఎం ఆదేశాలు
- జగనన్న గోరుముద్దలో మార్పులు
- మార్చి 2 నుంచి అమలు





హోసూరులో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యం

మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు		
మండలం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
పత్తికొండ	44	7,220
తుగ్గలి	66	7,942
వెల్దుర్తి	61	9,218
క్రిష్ణగిరి	46	7,532
మద్దికెర	26	3,750
మొత్తం	243	35,662

పత్తికొండటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి సంపూర్ణ పోషకాహారం అందించాలనే దృఢ సంకల్పంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జగనన్న గోరుముద్ద పథకం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ప్రత్యేక మెనూ అమలుచేస్తున్నారు. ప్రస్తుత మెనూతో పాటు మార్చి 2వ తేదీ నుంచి విద్యార్థులకు రాగి జావ అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వారానికి 3 రోజులు (మంగళ, గురు, శనివారం) రాగిజావ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వమే ప్రతి పాఠశాలకు రాగి పిండి, బెల్లం సరఫరా చేస్తుంది.

ప్రస్తుతం జగనన్న గోరుముద్ద మెనూ

- సోమవారం: వెజ్ పలావు, గుడ్డుకూర, చిక్కీ
- మంగళవారం: పులిహోర, చట్నీ, గుడ్డు
- బుధవారం: వెజ్ బిర్యానీ, బంగాళాదుంప కూర, గుడ్డు, చిక్కీ
- గురువారం: లెమన్ రైస్, టమాట చట్నీ, గుడ్డు
- శుక్రవారం: అన్నం, పప్పు, గుడ్డు, చిక్కీ
- శనివారం: ఆకుకూర అన్నం, స్వీట్ పొంగల్
- మెనూతో పాటు మార్చి 2వ తేదీ నుంచి వారంలో మూడు రోజులు రాగి జావ అందించనున్నారు.

పత్తికొండ నియోజకవర్గంలోని 5 మండలాల్లోని 243 ప్రభుత్వ పాఠశాలల్లో 35,662 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో ప్రతిరోజు 34 వేల మందికి పైగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నారు.

రాగిజావ అందించేందుకు చర్యలు



విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా రాగిజావ అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. మార్చి 2వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో అమలుకు చర్యలు చేపట్టాం. రాగి పిండి, బెల్లం ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. మధ్యాహ్న భోజన నిర్వాహకులు వారానికి 3 రోజులు రాగిజావ తయారుచేసి విద్యార్థులకు అందించాలి.

– రంగస్వామి, ఎంఈఓ, మద్దికెర

పోషకాలు అధికం



రాగి పిండిలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. కాల్షియం ఎముకల దృఢత్వానికి ఉపయోగపడుతుంది. వేరుశనగ, నువ్వులు,ఆకుకూరలు, గుడ్డుతో పాటు రాగి పిండిలో కాల్షియం పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి విద్యార్థులకు శక్తి, బలాన్ని ఇస్తాయి. పిల్లల్లో ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. రక్తహీనతను నివారిస్తుంది. వేసవిలో రాగిజావ వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

– హరిత, ప్రభుత్వ వైద్యాధికారిణి, పగిడిరాయి పీహెచ్‌సీ

మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు

తుగ్గలి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ రవి సోమవారం తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలకు 1,344 మంది ఓటర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లు 25 మంది ఉన్నారన్నారు. తుగ్గలిలోనే రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ వెల్లడించారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ

పత్తికొండ రూరల్: 'పర్యావరణం – సమస్యలు' అనే అంశంపై సోమవారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌లో పత్తికొండ ఏపీఆర్ స్కూల్ విద్యార్థి సిరాజుద్దీన్ ప్రతిభ చాటాడు. విద్యార్థి రూపొందించిన నమూనా ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

నందవరం: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి లబ్ధిదారులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలో ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తోందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేయిజీలు, విద్యుత్ దీపాలు, తాగునీటి కుళాయిలు వంటి వసతులను కల్పిస్తుందని వివరించారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల సాయంతో పాటు పొదుపు సంఘాల మహిళలకు రూ.35 వేల రుణం అందిస్తుందన్నారు. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, సీఓ లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బళ్లారిలో కదం తొక్కిన ఏపీ కన్నడిగులు



బళ్లారిలో ర్యాలీగా వెళ్తున్న ఏపీ కన్నడిగులు

హొళగుంద: ఏపీలో కన్నడ మీడియం చదివిన విద్యార్థులను కర్ణాటక ప్రభుత్వం 'గడినాడు కన్నడిగులు'గా గుర్తించాలని, విద్య, ఉద్యోగ పరంగా న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో ఏపీ కన్నడిగులు కదం తొక్కారు. బళ్లారి జిల్లా కోర్టు నుంచి కలెక్టరేట్ వరకు ప్రతిఘటన ర్యాలీ చేపట్టారు. హొళగుంద కన్నడ యువక సంఘం, ఏపీ కన్నడ సంఘాలు చేపట్టిన ఈ పోరాటానికి బళ్లారి జిల్లా కర్ణాటక రక్షణ వేదిక, తుంగభద్ర రైతు సంఘం, బంజార గిరిజన సమైఖ్య సంఘాలు సంపూర్ణ మద్దతు ఇచ్చి ఆందోళనలో పాల్గొన్నాయి. ఆ సంఘాల నాయకులు దొడ్డ బసప్ప, చానాళ్ శేఖర్, దరూరు పురుషోత్తంగౌడ్, కన్నడ సాహితివేత్త మరుళరాధ్య తదితరులు మాట్లాడుతూ.. కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని 62 కన్నడ పాఠశాలల్లో 12 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని, వారిని 'గడినాడు కన్నడిగులు'గా గుర్తించి, విద్య, ఉద్యోగావకాశాల్లో న్యాయం చేయాలని కోరుతూ బళ్లారి జిల్లా కలెక్టర్ పవన్ కుమార్ మాలపాటికి వినతి పత్రం అందజేశారు. నాయకులు ఊకూరు కాడప్ప, పంపాపతి, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్, డీఎస్ బాషా పాల్గొన్నారు.

సాయి నామం.. సర్వశ్రేష్టం

- నేటి నుంచి సాయి మందిర వార్షికోత్సవం

ఎమ్మిగనూరు: కుల–మతాలకు అతీతంగా, ధనిక–పేద తేడాలేకుండా అందరూ పూజించేది 'బాబా'.. ఉచ్చరించేది సాయి నామం. నిత్యం సాయినాథుని సేవతో.. సాయి దీక్షతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతోంది సాయిబాబా మందిరం. ఎమ్మిగనూరు శిల్పా ఎస్టేట్ వెనుక భాగంలో వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం నుంచి ప్రత్యేక ఉత్సవాలు మొదలు కానున్నాయి.

దాతల దాతృత్వం

ఎమ్మిగనూరు పట్టణంలో మొట్టమొదటిసారిగా 1998లో అంబుల సాంబశివరావు నేతృత్వంలో సాయి ఆశ్రమం ఏర్పాటుచేశారు. హెచ్‌బీఎస్ కాలనీలో ఏర్పాటైన ఆశ్రమం అత్యంత వేగంగా ఆధ్యాత్మిక, ధ్యాన కేంద్రంగా మారింది. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన కేఎం సత్యమ్మ సాయి ఆశ్రమానికి ఎకరా స్థలం విరాళంగా ఇచ్చారు. ప్రస్తుత రేటు ప్రకారం స్థలం విలువ సుమారు రూ.5 కోట్లు పైమాటే. దీంతో 2009లో శ్రీ షిరిడీ సాయి మందిర నిర్మాణం జరిగింది. అక్కడ ఏర్పడిన కాలనీకి సాయినగర్‌గా పేరు పెట్టారు.

నేడు 15వ వార్షికోత్సవం

ఎమ్మిగనూరు షిరిడీ సాయి మందిర్‌లో మంగళవారం 15వ వార్షికోత్సవం జరుపుతున్నట్లు సాయి సేవక్ కేఎం శ్రీనివాసులు, సాయి గురు వీరేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 5.15 గంటలకు బాబాకు కాగడ హారతి, 6 గంటలకు సుప్రభాతం, 7 గంటలకు అభిషేకం, 8 గంటలకు ఉచిత సామూహిక సాయి సత్యవ్రతములు, నిత్యప్రార్థనలు, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి, 1 గంటకు బాబా పల్లకోత్సవం పురవీధులగుండా జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు బాబావారి భజన, సాయిసేవక్ శ్రీనివాసులుచే షిరిడీ తత్వబోధామృతం సత్సంగ ప్రసంగములు, సాయంత్రం 6 గంటలకు ధూప హారతి ఉంటుందని తెలిపారు.



ఎమ్మిగనూరులో సాయిబాబా మూలవిగ్రహం

భూసర్వే పక్కాగా చేపట్టండి

ఆలూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన సమగ్ర భూసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని దేవనకొండ తహసీల్దార్ సుదర్శనం వీఆర్వోలు, సర్వేయర్లను ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక కార్యాలయంలో వివిధ గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో రైతుల భూములు, గ్రామ కంఠం, అసైన్డు, దేవాలయాలకు కేటాయించిన భూములను గుర్తించాలన్నారు. సర్వే పక్కాగా చేపట్టి హద్దులను ఏర్పాటు చేయాలని సూచించారు.

వాహనాలు అడ్డంగా నిలిపితే చర్యలు

మద్దికెర: స్థానిక పంచాయతీ కార్యాలయం ముందు రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపితే చర్యలు తీసుకుంటామని ఈఓ శ్రీహరి సోమవారం హెచ్చరించారు. ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను బస్టాండు వద్ద నిలిపేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆటోలు ఇష్టానుసారంగా దుకాణాల ముందు నిలపరాదని సూచించారు. ఒక ఆటో వెళ్లిన తర్వాత మరో ఆటో నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వెల్దుర్తి: స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వ ర్యంలో సోమవారం ఖాతాదారులకు బ్యాంకు ఆవరణలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు కళాజాత ఆర్గనైజేషన్ బృందం వారిచే అర్థవంతమైన పాటల రూపంలో బ్యాంకు పరిధిలోని రుణాలు, సామాజిక భద్రత, ఆరోగ్య బీమా పథకాలను వివరించారు. బ్యాంకు మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ రుష్యేంద్ర పాల్గొన్నారు.

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు

పత్తికొండ రూరల్: పత్తికొండ–చిన్నహుల్తి గ్రామ సమీపంలో కొలువైన ఈరన్న స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యుత్ బకాయిలు చెల్లించండి

హొళగుంద: గృహ, వ్యవసాయ ఇతర విద్యుత్ వినియోగదారులు పాత బకాయిలులను వెంటనే చెల్లించాలని ఆలూరు ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్ర ప్రసాద్ కోరారు. సోమవారం ఆయన విద్యుత్ బకాయిలపై వినియోగదారులను కలిసి బిల్లులు చెల్లించాలని కోరారు. మండలంలో భారీగా విద్యుత్ బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే విద్యుత్ పొదుపుగా వాడాలని, అక్రమ కనెక్షన్లతో చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఈ ఓబులమ్మ, సిబ్బంది మౌనాప్పాచారి, షణ్ముఖ వెంట ఉన్నారు.

జోరుగా ప్రచారం

పత్తికొండ రూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకుడు, అభ్యర్థి సోదరుడు చంద్ర ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం చేశారు. స్థానిక కొండగేరి, జూనియర్ కళాశాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు నాగళ్ల ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులకు చెక్కుల పంపిణీ

చిప్పగిరి: రబీ సీజన్‌లో సాగు చేసిన జొన్నలను రెండు రోజుల క్రితం ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2,970 ప్రకారం విక్రయించిన రైతులకు సోమవారం చెక్కులు అందాయి. జొన్న విక్రయాలకు సంబంధించి పౌరసరఫరాల శాఖ డీఎం షర్మిల ఆధ్వర్యంలో నగరడోణ, రామదుర్గం గ్రామాల రైతులకు సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జొన్నలు అమ్మాలనుకున్న రైతులు స్థానిక ఆర్బీకే కేంద్రాన్ని గానీ, ఆయా గ్రామాల వీఆర్‌ఓలను గానీ సంప్రదించాలని సూచించారు. తహసీల్దారు లక్ష్మినారాయణ, ఏఓ ఆనంద్, వీఆర్‌ఓలు మల్లికార్జున, కిష్టప్ప, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో శ్రీ రంగనాథస్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యువకులు, చిన్నారులు ఆనందోత్సాహాలతో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు.

వ్యాసరచన పోటీలు

పత్తికొండటౌన్: జాతీయ సైన్స్ డే పురస్కరించుకుని సోమవారం పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'గ్రీన్ ఎనర్జీ' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మాధురి తెలిపారు. పోటీలలో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

నిలిచిన శుద్ధ జలం సరఫరా

తుగ్గలి: నిర్వహణ లోపంతో శుద్ధ జలం సరఫరా నిలిచిపోయింది. మండల పరిధిలోని ఉప్పర్లపల్లి వద్ద ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నుంచి ట్యాంకర్ల ద్వారా గ్రామాల్లోని వాటర్ ఏటీఎంలకు సరఫరా చేసేవారు. అక్కడి నుంచి కార్డుల ద్వారా ప్రజలు నీటిని తీసుకెళ్లే వారు. నిర్వహణ లేక గత కొన్ని నెలలుగా మూడు ట్రాక్టర్లు మూలనపడ్డాయి. మరో రెండు ట్రాక్టర్ల ద్వారా అక్కడక్కడ శుద్ధ జలం సరఫరా చేసేవారు. అయితే గతంలో ప్లాంట్‌లో పనిచేసే కార్మికులకు దాదాపు రూ.3 లక్షల దాకా వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో వారు నీటి సరఫరాను నిలిపివేశారు. పలుమార్లు కాంట్రాక్టర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి తమకు వేతనాలు ఇప్పించాలని కార్మికులు కోరుతున్నారు.

6 గడ్డివాములు దగ్ధం


ఆలూరు రూరల్/హాలహర్వి: గూళ్యం గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని 6 గడ్డివాములు దగ్ధమయ్యాయి. సోమవారం సాయంత్రం 7 గంటలకు గ్రామంలోని మారెమ్మవ్వ దేవాలయం సమీపంలో అగ్ని ప్రమాదం జరిగింది. వివరాలు.. హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన రైతులు వీరేష, పంపాపతి, శివ, మల్లన్న గౌడ్‌లు పశువుల గ్రాసం కోసం ఇటీవలే వరిగడ్డి కొనుగోలు చేసి గ్రామంలో గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పంటుకుని మంటలు చెలరేగడంతో గ్రామస్తులు ఫైర్ అధికారులకు సమాచారం అందించారు.ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అగ్నిప్రమాదంలో ఆరు గడ్డివాములు దగ్ధం కాగా రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లిదని బాధిత రైతులు వాపోయారు. విషయం తెలుసుకున్న హాలహర్వి తహసీల్దార్ మల్లికార్జున సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి రైతులకు న్యాయం చేస్తామన్నారు.



గూళ్యంలో దగ్ధమవుతున్న గడ్డివాములు

సాహిత్యంతో సమాజాభివృద్ధి

పత్తికొండ రూరల్: అభ్యుదయ సాహిత్యంతో సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. సోమవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో కమలా కళానికేతన్ సాహితీ సంస్థ 37వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. రచయిత్రి రామలింగమ్మ జ్యోతి ప్రజ్వలన చేశారు. సవ్వప్పగారి ఈరన్న రచించిన 'పల్లెలు – నాడు – నేడు' పుస్తకాన్ని సాహితీవేత్తలు ఆవిష్కరించారు. కవి వెంకటేశ్వర యాదవ్ పుస్తక సమీక్ష చేశారు. సాహితీవేత్తలు రిటైర్డు ఆర్‌ఐ షేక్షావలి, అమీనాబి, ఈశ్వరప్ప, రవికుమార్, రంగన్న, కాశీంశెట్టి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

నాటుసారా స్థావరంపై దాడులు



నాటుసారా స్థావరాన్ని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

ఆదోని రూరల్ : పట్టణ సమీపంలోని గద్దరాళ్ల కొండపై ఉన్న నాటుసారా స్థావరంపై సెబ్ సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన శివారెడ్డి, శ్రీనివాస్ ను గుర్తించి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సెబ్ ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాల తనిఖీ

కృష్ణగిరి: గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల మెరుగైన వైద్య సేవలు అందించాలని పంచాయతీరాజ్ ఏఈ అబ్దుల్‌వహీద్ వైద్య సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని లక్కసాగరం, కంబాలపాడు, ఎరుకలచెర్వు ఆరోగ్య ఉప కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ మూడు కేంద్రాలకు సంబంధించి బిల్డింగ్‌లు ఉన్నాయా? లేదా? అని నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఎరుకలచెర్వులో పూర్తిస్థాయి భవనం లేదని, లక్కసాగరం, కంబాలపాడు గ్రామాల్లో భవనాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో సీఎం వైఎస్ జగన్ అన్ని సచివాలయ పరిధిలో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారన్నారు.

అనుమతి లేకుండా లేఅవుట్లు వేస్తే చర్యలు



భూములు పరిశీలిస్తున్న ఆర్డీఓ మోహన్‌దాస్

మద్దికెర: గ్రామాల్లో రెవెన్యూ, పంచాయతీ అనుమతులు లేకుండా లే అవుట్లు వేస్తే చర్యలు తీసుకుంటామని పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ హెచ్చరించారు. మద్దికెరలో లేఅవుట్ల అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న భూములను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంబంధిత శాఖల అనుమతులు వచ్చిన తర్వాతే ప్లాట్లు వేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే రెవెన్యూ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి తదితరులు ఉన్నారు.

మైనార్టీ నాయకుడి మృతి



యూసుఫ్ (ఫైల్)

హొళగుంద: మండల కేంద్రంలోని ఈర్లకట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్న మైనార్టీ నాయకుడు నేమకల్ అనికట్టు యూసుఫ్ (96) సోమవారం వృద్ధాప్య సమస్యలతో మృతి చెందాడు. ఈయనది వ్యవసాయ కుటుంబం. ముస్లిం మైనార్టీల అభివృద్ధికి సేవలందించారు. అతని భార్య 27 ఏళ్ల క్రితమే మరణించింది. ఈయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. యూసుఫ్ ఎలాంటి ఆరోగ్య సమస్య లేకుండా జీవించారని అకస్మాత్తుగా మృత్యువాత పడ్డారని కుటుంబ సభ్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న ముస్లిం మైనార్టీలు, ఆయా పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

క్రమపద్ధతిలో శనగ కొనుగోళ్లు



వివరాలు తెలియజేస్తున్న ఏఓ హేమలత

మద్దికెర: రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకున్న ప్రకారం క్రమపద్ధతిలో పప్పు శనగ దిగుబడుల ను క్వింటాలుకు రూ.5,335 ధర ప్రకారం కొనుగోలు చేస్తామని ఏఓ హేమలత, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, డీసీఎం రామకృష్ణ పేర్కొన్నారు. వారు సోమవారం స్థానిక ఆర్బీకేలో మాట్లాడుతూ.. రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పు శనగ దిగుబడులను ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బయట మార్కెట్లో కన్నా అధిక ధరలకు శనగ కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా దస్తగిరయ్య స్వామి ఉరుసు

కృష్ణగిరి: మండల కేంద్రంలో సోమవారం దస్తగిరయ్య స్వామి ఉరుసును గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో స్వామికి పూజలు నిర్వహించారు. రాత్రి చెక్కభజన కార్యక్రమం అలరించింది. మంగళవారం కిస్తీ వేడుకలతో ఉరుసు ఉత్సవాలు ముగియనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కబడ్డీ విజేత ప్యాపిలి జట్టు

ఉరుసు సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో నంద్యాల జిల్లా ప్యాపిలి జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజులుగా జరిగిన పోటీల్లో 32 జట్లు పోటీపడగా ప్యాపిలి, కృష్ణగిరి కిల్లర్ జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. మూడో స్థానంలో సంగాల జట్టు నిలిచింది. గెలుపొందిన జట్లకు దాతల సాయంతో వరుసగా రూ.15 వేలు, రూ10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులను అందజేశారు. అలాగే క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నట్లు వారు తెలిపారు.



కబడ్డీ ఫైనల్‌లో తలపడుతున్న ప్యాపిలి, కృష్ణగిరి కిల్లర్ జట్లు